# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**రేఖ, లీసా** చాల స్నేహంగా వుంటారు.

చనువుగా ఒకరి విషయాలు ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటుంటారు.

"ఇందాకే మీ ఆయన ఫోన్ చేశాడు, నువ్వు ఆఫీసులో వున్నావా అని అడిగాడు. లేదు మెటర్నిటీ లీవులో వున్నావని చెప్పాను. అదేమిటి, నువ్వు లీవులో వున్నావని కూడా ఆయనకి తెలీదా?" అని అడిగింది లీసా నవ్వుతూ.

రేఖ కూడా నవ్వింది. "నీతో వంటరిగా మాట్లాడాలి. లోపల కొంచెం పని వుంది. అదవగానే వచ్చి నీతో మాట్లాడాకే వెడతాను" అన్నది.

"సరే, ఏదో పెద్ద కథే వున్నట్టుందే" అన్నది నవ్వుతూ లీసా.

లీసా భుజం మీద ఒకసారి సుతారంగా తట్టి లోపలికి వెళ్ళింది రేఖ.

లోపలికి వెళ్ళగానే అందరూ సమీరకి అమ్మాయి పుట్టిందని అభినందనలు చెబుతున్నారు.

వారందరినీ పలకరించటం అయాక ఎకౌంట్ ఆఫీసరుని కలిసి పని పూర్తి చేసుకుంది.

రిసెప్షన్ ఏరియాలో, లీసా పక్కనే కూర్చుని గొంతు తగ్గించి, నెమ్మదిగా జరిగినదంతా చెప్పింది.

అంతావిని, "నీ వైవాహిక జీవితం సరిగ్గా లేదని చెప్పావుగానీ, ఇలా అవుతుందని నేను అనుకోలేదు. సారీ రేఖా! ఇంకా పెద్ద ఘోరాలు జరగకుండానే బయటికి వచ్చేసి మంచిపని చేశావు. కోర్టుకి వెళ్ళి అతనితో తెగతెంపులు చేసుకో. నీకోసం అతను ఇక్కడికి వచ్చినా నన్ను దాటితేనే కదా లోపలికి రావటం. అది నాకొదిలేయి" అన్నది.

రేఖ పెద్దగా నవ్వింది. "మా అమ్మమ్మ కథలు చెబుతుండేది. ద్వారపాలకులు ఎలా కోట లోపల వున్నవారిని రక్షిస్తారో అని. నీ సంగతి నాకు బాగా తెలుసుగా" అన్నది.

"నాకు తెలిసిన ఒక లాయరున్నాడు. నాకూ, నా స్నేహితురాలు ఒకమ్మాయికి ఇంతకన్నా సీరియస్ విషయాల్లోనే, గృహహింస, నిర్బంధనలాటివి, ఎంతో సహాయం చేశాడు. ఆయన ఫోన్ నెంబర్ నా దగ్గర వుంది. ఇస్తాను. వెంటనే ఆయన్ని పిలు" అంది.

"తప్పకుండా. ఫోన్లో మాట్లాడుకుందాంలే" అని బయల్దేరింది రేఖ.

ఫోన్ చేయగానే వేణు, "నా పని పూర్తిచేసుకుని ఇప్పుడే ఇక్కడికి వచ్చాను. పార్కింగ్ లాట్లో వున్నాను. క్రిందికి వచ్చేయి" అన్నాడు.

కారులో కూర్చున్నాక ఆఫీసులో జరిగిన విషయాలన్నీ చెప్పింది రేఖ.

"నాకు ఈ లాయర్ల వ్యవహారాలేవీ తెలీదు. నీ స్నేహితురాలు రికమెండ్ చేసింది కదా, ఆయనతోనే ఈ మధ్యాహ్నం మాట్లాడదాం. సరేనా" అన్నాడు వేణు.

తలవూపింది రేఖ.

లంచ్ తినేశాక లాయర్ మైకేల్ కార్సన్ని పిలుద్దామని అనుకుంటుండగా, వేణు ఫోన్ మ్రోగింది.

ప్రకాష్ ఫోన్ చేశాడు లాసేంజలస్ నించీ.

"ఎలా వున్నారు?" అని అడిగాడు.

వేణు అప్పటిదాకా జరిగిందంతా చెప్పాడు.

"నేను అనుకున్నాను వాళ్ళు రేఖ బాంక్ ఎకౌంటుని గోల్మాల్ చేస్తారని. జరిగిపోయిన దానికి మనం ఏమీ చేయలేం. ఇక ముందు ఏంచేయాలో చూద్దాం. ఇక్కడ లాసేంజలేస్లో ఒక ఇండియన్ ఆవిడ వుంది. తమిళియన్. పేరు కాంతిమతి శ్రీనివాసన్. ఆవిడ ఇలాటి ఎబ్యూస్డ్ ఫామిలీ కేసుల్లో ఇరుక్కున్న వాళ్ళకి చాల సహాయం చేస్తుంటుంది. మన ఇండియన్ కమ్యూనిటీలో ఆవిడకి మంచి పేరు వుంది. ఆవిడ చేసేది డబ్బు కోసం కాదు. సోషల్ వర్కర్. ఆవిడది మంచి మనసు. అంతే! ఆవిడతో చాలసేపు మాట్లాడాను. ముందుగా మంచి 'ఫామిలీ మాటర్స్' లాయరుతో మాట్లాడి, వాసుగానీ అతని తల్లిదండ్రులు కానీ, రేఖ–సుమల దరిదాపులకు కనీసం ఐదు, పది మైళ్ళ దూరం లోపలకు రాకూడదనీ, రేఖతో మాట్లాడకూడదనీ కోర్టు స్టే ఆర్డర్ తీసుకోమన్నారు. ఆ లాయరే విడాకులకీ, ఆలిమోనీకి కూడా మనకి సహాయం చేసేలా చూడమని చెప్పింది. ఇదిగో ఆవిడ ఫోన్ నెంబర్"

"అలాగే. మైకేల్ కార్సన్ అని ఒక మంచి లాయర్ ఇలాటి వాటిల్లో దిట్ట అని రేఖ ఆఫీసులోనే పనిచేసే ఒకమ్మాయి చెప్పింది. ఇప్పుడే ఆయన్ని పిలుద్దామనుకుంటున్నాం. ఈలోగా నువ్వు పిలిచావు" అన్నాడు వేణు.

“వేణూ, ఇక్కడ లాయర్ల సంగతి తెలుసుగా నీకు. గంటకి మూడు, నాలుగు వందల డాలర్లు తీసుకుంటారు. మనకు తడిసి మోపెడవుతుంది. రేఖ అంత ఫీజు భరించలేదు. మనమే ఏదయినా చేయాలి. మనం కొంత ఇద్దాం. తర్వాత మన స్నేహితులు ఎవరైనా ఇస్తారేమో చూద్దాం” అన్నాడు ప్రకాష్.

“సరే. ముందు లాయరుతో మాట్లాడాక చూద్దాం మన కమిట్మెంట్ ఎంతో” అన్నాడు వేణు ఫోన్ పెట్టేస్తూ.

వాళ్ళ సంభాషణ వింటున్న రేఖ అన్నది, “రాత్రి మా నాన్నగారిని పిలిచి మాట్లాడాను అంకుల్. ఆయన మనం చేస్తున్నది సరైన పనే అన్నారు. మేమెవరమో తెలియక పోయినా, మాకు ఇంతగా సహాయం చేస్తున్నందుకు మీకూ, ఆంటీకీ ఎన్నో ధన్యవాదాలని చెప్పమన్నారు. మీతో కూడా ఒకటి రెండురోజుల్లో మాట్లాడతానన్నారు. ఆయన ఉద్యోగం మానేసి పదేళ్ళ క్రితమే చెన్నైలో ఒక సప్లయర్ మేనేజ్మెంట్ కంపెనీ పెట్టారు. ఒక మేనేజరూ, ఆయనకి సహాయం చేయటానికి ఇంకో ఇద్దర్నీ పెట్టుకున్నారు. తను కనీసం నెలకి రెండు మూడుసార్లు అక్కడికి వెళ్ళి బిజినెస్ చూస్తుంటారు. చాలవరకూ ఆటోమొబైల్, సెమీకండక్టర్ పార్ట్స్ సప్లయర్స్. ఆయనకి ఇక్కడ అమెరికాలో టెక్ససులో ఇద్దరు, సిలికాన్ వేలీలో ఒకరు క్లయంట్స్ వున్నారు. వాళ్ళ ద్వారా కొంత అమెరికన్ డాలర్లలోనే ఇవ్వగలను అన్నారు. ఆయన దగ్గర సేవింగ్సులో వున్నది కూడా పంపిస్తానన్నారు. మరీ అవసరమైతే మా ఆఫీసులో కొంత లోన్ లాగా తీసుకుంటాను. ఇందాక మా ఎకౌంట్స్ ఆఫీసర్ని అడిగితే అలా తీసుకోవచ్చు, ప్రయత్నం చేద్దాం అన్నది”

“సరే లాయరుతో మాట్లాడదాం” అన్నాడు వేణు.

“నా పెళ్ళికే ఎంతో ఖర్చు పెట్టాడు మా నాన్న. ఇప్పుడు అనుకోకుండా ఇదొక ఖర్చు. ఇక ఆయన రిటైర్మెంటుకి ఏమీ మిగిలేటట్టు లేదు” అంది రేఖ కొంచెం దిగులుగా.

వేణు ఆమె తల మీద చేయి వేసి నిమురుతూ, “అన్నీ సర్దుకుంటాయి నాన్నా. కాకపోతే కొంచెం సమయం పడుతుంది” అన్నాడు ఓదార్పుగా.

రేఖ తన ఫోన్లో లాయర్ ఆఫీసుకి ఫోన్ చేసింది.

ఫోన్ తీసిన రిసెప్షనిస్టుని అడిగింది, లాయర్ మైకేల్ కార్సన్ వున్నారా, మాట్లాడాలి అని.

ఆమె కొత్త క్లయంటా, పాత క్లయంటాలాటి కొన్ని ప్రశ్నలడిగి, “మామూలుగా ఆయన చాల బిజీ. ఇప్పుడే ఒక క్లయంటుతో మాట్లాడి పంపించారు. ఇంకో అరగంటలో మరో క్లయంట్ రాబోతున్నారు. యు ఆర్ లక్కీ” అని ఆయనతో తను మాట్లాడి, రేఖని కనెక్ట్ చేసింది.

“గుడాఫ్టర్ నూన్. నా పేరు రేఖ. నాతోపాటు మా అంకుల్ వేణు కూడా స్పీకర్ ఫోన్లో ఇక్కడే వున్నారు. థాంక్స్ ఫర్ టేకింగ్ అవర్ కాల్” అంది.

ఆయన కూడా “గుడాఫ్టర్ నూన్ టు బోత్ ఆఫ్ యు” అని, కేసు వివరాలు క్లుప్తంగా విన్నాడు.

"మీ దగ్గర అతను మిమ్మల్ని హింసించినట్టు ఆధారాలేమైనా వున్నాయా?" అడిగాడు.

ఒక్క క్షణం ఆలోచించి అన్నది రేఖ. "ఉన్నాయి. నా ఫోనులో నేను చేసిన అతని మాటల రికార్డింగులూ, వాసూ అతని కజిన్ పంపించుకున్న టెక్స్ట్ మెసేజీలు... మొదలైనవి"

ఆయన రేఖని ఇంకా కొన్ని ప్రశ్నలడిగి తనకి కావాలసిన సమాచారం సేకరించాడు.

"ఇప్పుడు నాకు ఇంకో ఎపాయంటుమెంట్ వుంది. మీ కేసు తీసుకుంటాను. రేపు మధ్యాహ్నం నాకు ఒక గంట ఖాళీ వుంది. అప్పుడు కలుద్దాం. ఈలోగా మీ భర్త వాసు పూర్తి పేరు, అడ్రస్ అన్నీ నా సెక్రటరీకి ఇవ్వండి" అన్నాడు లాయర్ మైకేల్ కార్సన్.

## 7

ఆరోజు ప్రొద్దున్నే లేచి గబగబా తయారయింది సమీర.

యూనివర్సిటీలో మొదటి రోజు. వాళ్ళేమీ చెప్పలేదుగానీ, తొమ్మిది గంటలకి అక్కడ వుంటే బాగుంటుంది అనుకున్నది సమీర.

గదికి తాళం వేసి బయటకి వస్తుంటే, "ఉండండి, నేనూ వస్తున్నాను" అంటూ హడావిడిగా వచ్చాడు అశోక్ ముఖర్జీ.

"యూనివర్సిటీకేగా. నేనూ అక్కడికే. మొదటి రోజు ఎలా వుంటుందో, ఏమో. మాపులో చూశాను మీ బిల్డింగూ, మా బిల్డింగూ దగ్గరగానే వున్నాయి. దారిలో చిన్న కాంటీన్ వుంది. అక్కడ కాఫీ తాగేసి వెడదామా?" అన్నాడు.

"అలాగే. రాత్రి బాగా నిద్రపట్టిందా? ఇంకా జెట్లాగ్ వుందా?" అడిగింది సమీర.

"ఫరవాలేదు. కలకత్తానించీ లండన్ దాకా ప్లేన్లో బాగా నిద్రపోయాను. అందుకే ఇప్పుడు నిద్రమత్తు లేకుండా బాగుంది" అన్నాడు అశోక్.

ఆ కాంటీన్లోనే బ్రెడ్ టోస్ట్ తిని, ఇద్దరూ కాఫీ తాగారు.

"కల్చరల్ యాంత్రపాలజీ అంటే సాంస్కృతిక మానవ శాస్త్రమా" అని అడిగింది సమీర.

"అవును. మొదటినించీ నాకు ఆ విషయం మీద ప్రేమ. పిచ్చి. అందుకే పీహెచ్డీ చేశాను. ఇప్పుడు ఇక్కడ పోస్ట్ డాక్. ఇక్కడయితే రకరకాల దేశాలవారిని కలిసే అవకాశం వుంది. ఎన్నో సంస్కృతుల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం వుంటుందని వెంటనే నా రీసెర్చి కొనసాగిద్దామని ఇక్కడికి వచ్చేశాను" అన్నాడు అశోక్.

"అవును నిజమే. అమెరికాలోలాగానే ఇక్కడా ఎన్నో సంస్కృతులవాళ్ళు కనిపిస్తారు" అంది సమీర.

ఇద్దరూ కలసి అక్కడ సైన్ బోర్డులో వున్న యూనివర్సిటీ మాప్ చూసుకుంటూ ఎవరి డిపార్ట్మెంటుకి వాళ్ళు వెళ్ళిపోయారు.

సమీరకి మొదటి రోజు బాగానే వుంది. కానీ అమెరికాలోలాగా ప్రొద్దున్నే రావలసిన సమయానికి లాబ్ టెక్నీషియన్స్ తప్ప ఎక్కువమంది డిపార్ట్మెంటుకి రాలేదు. కొంతమంది తీరిగ్గా వస్తున్నారు. పెద్ద హడావిడిగా కూడా లేదు. కలవాల్సిన వాళ్ళని కలిసింది. లంచికి తన ప్రొఫెసర్ అక్కడే యూనివర్సిటీ కాఫెటేరియా డైనింగ్ హాలుకి తీసుకువెళ్ళాడు.

మధ్యాహ్నం తను పని చేసుకుంటుంటే, అట్లాంటానించీ మధు, తన ఎక్స్, పిలిచాడు. అతని పేరు చూసి ఫోన్ తీయలేదు సమీర. తర్వాత ఒక్క గంటలోనే రెండు, మూడుసార్లు పిలిచాడు. చివరిసారి తను బాగానే వున్నాననీ, ఒకసారి పిలవమనీ మెసేజ్ పెట్టాడు.

“ఇడియట్... ఇంకా నేను అతని భార్యనే అనుకుంటున్నాడా? ఎందుకు అలా పిలుస్తాడు?” అనుకున్నది.

అతన్ని తిరిగి పిలవలేదు. జవాబివ్వలేదు.

ఆరోజంతా కొంచెం నెమ్మదిగా గడిచినా బాగానే వుంది.

అక్కడ అందరూ ఎంతో స్నేహపూరితంగా మాట్లాడారు. కాకపోతే కొందరి థిక్ బ్రిటిష్ ఇంగ్లీష్ యాస అర్ధం చేసుకోవటానికి కొంత సమయం పట్టింది.

సాయంత్రం హాస్టలుకి వెడుతూ నిక్ ఫోన్ నెంబరుని పిలిచింది.

ఎన్నోసార్లు రింగవుతున్నా అతను తీయలేదు.

రూముకి వచ్చి చికాగోలో అమ్మతో చాలసేపు, నాన్నతో కొద్దిసేపు మాట్లాడింది. అమ్మ తీరిగ్గా వింటుంది. ఏమీ అడగదు. నాన్న అలా కాదు. ఎన్నో ప్రశ్నలడుగుతాడు. తనకి వాటికి వేటికీ సమాధానాలు ఇవ్వటం ఇష్టం వుండదు. అందుకే ఎప్పుడూ అమ్మతో చాలసేపు, నాన్నతో కొద్దిసేపు మాట్లాడుతుంది.

నిక్ ఫోనుకి మళ్ళీ పిలిచింది.

జవాబు లేదు.

“ఏమయింది ఇతనికి” అనుకుంది.

స్నానం చేసి నిన్న వెళ్ళిన నాలుగు రోడ్ల కూడలికే నడక మొదలుపెట్టింది. కొంచెం చలిగా వుందేమో జాకెట్ వేసుకుంటే వెచ్చగా బాగుంది. అప్పుడే సూర్యాస్తమయం కూడా అవుతున్నది.

నడుస్తూనే ఫోన్ తీసి మళ్లీ నిక్ ఫోనుకి పిలిచింది.

ఎంతసేపు మ్రోగినా ఫోన్ తీయటంలేదు.

సమీరకి అతని మీద కొంచెం కోపం కూడా వచ్చింది.

నిన్న ఎంత బాగా ప్రవర్తించాడు. ఇవాళ ఏమయింది? అతను తనని పట్టించుకోవటంలేదా?

తనతో అతనికి బాబ్ అప్పజెప్పిన పని ఇక అయిపోయిందనుకున్నాడా? ఇద్దరి మధ్యా నిన్న ఏమీ గొడవలు కూడా రాలేదే!

మెసేజ్ పెట్టమని సందేశం కూడా రాలేదు. మెసేజీలు పెట్టకుండా కావాలనే అలా చేశాడా?

సమీర అలాటి రిజక్షన్ భరించలేదు మరి!

అక్కడ నిన్న వెళ్ళిన ఇటాలియన్ రెస్టారెంటుతో పాటు, ఒక ఇండియన్, చైనీస్, మెక్డొనాల్డ్స్, పిజ్జా ప్లేస్, ఒక ఫిష్ అండ్ చిప్స్... ఇలా ఆరేడు రెస్టారెంట్లు వున్నాయి.

ఇక్కడ వున్న పన్నెండు నెలలూ ఇక వీటన్నిటికీ మళ్ళీ మళ్ళీ వెడుతూనే వుండాలి కాబోలు అనుకున్నది.

ఎటు వెళ్ళాలా అని ఆలోచిస్తూనే, ఇండియన్ రెస్టారెంటు వేపు నడిచింది.

అదీ చిన్న రెస్టారెంటే. ఏడెనిమిది టేబుల్స్ వున్నాయి. లైట్లు కూడా కాంతివంతంగా లేవు.

ఆ సన్నటి కాంతిలోనే, ఒక పక్క వున్న టేబుల్ దగ్గర కూర్చుని మామిడిపండు లస్సీ త్రాగుతూ కనిపించాడు అశోక్.

తనూ అక్కడికే వెళ్ళి, హలో అంటూ అతనికి ఎదురుగా కూర్చుంది.

అశోక్ నవ్వుతూ, "మళ్లీ కలిశాం. ఎలా వుంది ఇక్కడ యూనివర్సిటీలో మీ మొదటి రోజు" అడిగాడు.

సమీర కూడా నవ్వుతూ "మామూలే. బాగానే వుంది. మీకు?" అడిగింది.

"మామూలే. కాకపోతే బెంగాలీ మాట్లాడటానికి ఒక బంగ్లాదేశ్ అమ్మాయి కూడా కలిసింది. ఇక్కడ ఎం.ఎస్. చేస్తున్నదిట" అన్నాడు.

"మీ స్నేహితుడు వినీల్ రాలేదా?" అడిగింది.

"అతను వేరే వూళ్ళో ఇక్కడికి రైల్లో ఇరవై నిమిషాల దూరంలో వుంటాడు. నన్నిక్కడ దించి నిన్ననే వెనక్కి వెళ్ళిపోయాడు" అన్నాడు అశోక్.

అశోక్ మాట్లాడేటప్పుడు, సమీర ముఖంలోకి, కళ్ళల్లోకి చూసి మాట్లాడడు. అది భారతీయ సంస్కృతి అంటుండేవాళ్ళు మనవాళ్ళు. ఇతనూ అంతేనా లేక ఆడవాళ్ళంటే కొంచెం ముఖమాటమో, బెరుకో అయుంటుందా అనుకున్నది. అంతేకాదు అశోక్ అవసరానికి తప్పితే, మిగతాదేదీ ఎక్కువగా మాట్లాడడు. స్నేహపూరితంగా వున్నా, ముక్తసరిగా వుంటాడు. పెద్ద మాటకారి కాదు కూడాను.

ఈలోగా వైటర్ వచ్చాడు. అతను మలయాళీ. "బాగున్నారా?" అని పలకరించి, "మీకు ఏం కావాలో చెప్పండి" అని అడిగాడు.

మెన్యూ చూసి ఇద్దరూ ఏంకావాలో చెప్పారు.

“ఈ రెస్టారెంటు మీదేనా?” అడిగింది సమీర అక్కడ గోడల మీదున్న రాజా రవివర్మ బొమ్మలు చూస్తూ.

అతను నవ్వాడు. “లేదు. ఇది మా కేరళ మలయాళీలదే. నేను ఇక్కడే యూనివర్సిటీలో చదువుకుంటున్నాను. రాత్రిపూట ఇక్కడ పని చేస్తున్నాను. అలా అయితే తిరువనంతపురనించీ నాన్నని డబ్బులు అడగనక్కరలేదుగా” అన్నాడు. అని ఆర్డర్ తీసుకుని లోపలికి వెళ్ళాడు.

“మీ కల్చరల్ యాంత్రపాలజీ భాషలో చెప్పండి మన బెంగాలీలకూ, బంగ్లాదేశ్ వారికీ సాంస్కృతికంగా తేడాలు ఏమిటి?” అడిగింది సమీర.

“ఈ విషయంలో కాస్తో కూస్తో తెలుసుగానీ, ఒక పరిశోధనలాగా చేయలేదు. ఇప్పుడు ఆ అవకాశం వచ్చేటట్టు వుంది. మీరు ఇక్కడ మీ పని పూర్తి చేసుకుని వెనక్కి వెళ్ళేలోగా మీ ప్రశ్నకు జవాబు చెబుతాను” అన్నాడు అశోక్.

అక్కడ వున్న గంటన్నరసేపూ సమీర ఆగకుండా మాట్లాడుతూనే వుంది.

మాట్లాడటానికి ఆమె అశోక్కి ఇచ్చిన అవకాశాలే తక్కువ, ఏదయినా అడిగినా అతని జవాబులు కూడా క్లుప్తంగా వుంటున్నాయి.

“ఈమెకి ఆగకుండా మాట్లాడటం మహా ఇష్టం. నా నోరు అఖ్కర్లేదు. నా చెవులు ఆమె చెప్పేది వింటుంటే చాలు” అనుకున్నాడు అశోక్.

“ఇతనేమిటో మాట్లాడటానికే బిడియపడతాడు. గుప్తంగా వుంటాడు. మనసులో అసలు ఏమని అనుకుంటున్నాడో తెలుసుకోవటమే కష్టం. పాపం, ఎలా బ్రతుకుతాడో ఏమో” అనుకుంది సమీర.

ఎపార్టుమెంటుకి వెళ్ళాక ఫోనులో చూసుకుంది, నిక్ ఫోన్ చేశాడా, మెసేజ్ పంపించాడా అని.

రెండూ లేవు.

మళ్ళీ అతనికి ఫోన్ చేద్దామా అనుకుంది. ఇప్పటికే మూడు, నాలుగుసార్లు ఫోన్ చేసింది. అతనికి లోకువ కాకూడదు. అభిమానం అడ్డం వచ్చింది.

చూద్దాం, అతనే పిలుస్తాడేమో అనుకుని ఇక ఫోన్ చేయలేదు.

మంచం మీద తీరిగ్గా పడుకుని జస్సికాని పిలిచింది.

“బాగున్నావా? ఎలా వుంది అక్కడ?” అడిగింది జెస్సికా.

సమీర యూనివర్సిటీలో ఎలా వుందో, అక్కడ ఎవరెవరిని కలిసిందో, అశోక్ పరిచయం అన్నీ చెప్పింది.

అశోక్ గురించి తన ‘స్వంత అభిప్రాయాల ఫైల్’ బయటికి తీసి ఎన్నో చెబుతూనే వుంది.

కొంతసేపు అయాక జెస్సికా అడిగింది.

"నిక్ ఎలా వున్నాడు? ఇవాళ ఇద్దరూ ఎక్కడికైనా వెళ్ళారా?" అని.

"రాలేదు. ఎక్కడ వున్నాడో ఏం చేస్తున్నాడో తెలియదు. నిన్న రాత్రి కలిసినప్పుడు తను ఈ వారమంతా సత్యాన్వేషణలో వుంటాననీ, వచ్చే వారం షేక్స్పియర్ పుట్టిన ప్రదేశానికి వెడతాననీ అన్నాడు"

పెద్దగా నవ్వింది జెస్సికా. "అతనికి ఇంగ్లీష్ సాహిత్యం అంటే ప్రాణం. అందుకే అక్కడ షేక్స్పియర్, కీట్స్, బైరన్, సర్ ఆర్థర్ కానన్ డాయల్, జాన్ మిల్టన్... ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా చదివేవాడు. ఇప్పుడు వాళ్ళ మ్యూసియంలు, మెమోరియల్ స్థలాలు, పుట్టిన ప్రదేశాలు చూస్తున్నాడు. బాబ్, నేనూ అదే అనుకున్నాం. మూడు, నాలుగు సంవత్సరాలు పగలూ రాత్రీ కూడా కష్టపడి వేరే కంపెనీకి పనిచేసి ఇప్పుడు మళ్ళీ స్వంత ప్రాక్టీసు మొదలుపెట్టేలోగా, తన ఆనందం కోసమే ఈ రెండు నెలల సమయం కేటాయించుకుని అనుకున్నవన్నీ చేసేస్తున్నాడు. వాట్ ఎ గ్రేట్ గై" అన్నది.

"అదేమోగానీ నేను రెండు, మూడుసార్లు ఫోన్ చేశాను. పలకలేదు" అంది కొంచెం బెరుగ్గా.

"ఎందుకు, బెర్నార్డ్ షా గారి ఇంటికి భోజనానికి వెళ్ళుంటాడు. అక్కడినించీ రాగానే అతనే పిలుస్తాడు" అంది జెస్సికా పెద్దగా నవ్వుతూ.

సమీర నవ్వలేదు.

"బాగా టైర్ అయిపోయాను. నిద్ర వస్తున్నది. రేపు మాట్లాడదాములే" అని ఫోన్ పెట్టేసింది.

"అవును నిన్నంతా ఆ రచయితల గురించీ, కవుల గురించీ ఎంతో ఉత్సాహంగా చెప్పాడు. అది తప్ప అతని గురించి ఏమీ చెప్పలేదు. నా గురించి కూడా ఏమీ అడగలేదు. అదేం మనిషో!" అనుకున్నది సమీర.

పడుకోబోయే ముందు మళ్ళీ ఇంకొక్కసారి ఫోనులో చూసింది, నిక్ పిలిచాడేమోనని.

అతని దగ్గరనించీ మిస్డ్ కాల్ కానీ, మెసేజ్ కానీ ఏవీ లేవు.

నిన్న కొంచెం ముందుగా వెడితే, ఎక్కువమంది రాలేదు కదా అని, మర్నాడు కొంచెం ఆలస్యంగానే నిద్రలేచి తయారయింది సమీర.

అదే కాంటీనులో కాఫీ తాగింది. అశోక్ కనపడలేదు. అప్పటికే యూనివర్సిటీకి వెళ్ళిపోయాడేమో.

తనూ యూనివర్సిటీలో ఆరోజు కొంచెం బిజీగానే వుంది.

మధ్యాహ్నం యూనివర్సిటీ కేఫటేరియాలో వున్నప్పుడు సమీరకి ఫోనులో ఈ-మైల్ వచ్చినట్టు టింగ్ అంటూ శబ్దమయింది. మధు దగ్గర నించి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments